క్లుప్తంగా

బావిలో వివాహిత మృతదేహం

ఆత్మకూరు : బావిలో పడి వివాహిత మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని అక్కంపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కంపేటకు చెందిన మెహరున్నీసా (48) నాలుగు నెలల నుంచి మానసికంగా బాగాలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లో అందరు నిద్రిస్తుండగా భర్త అబ్బాసలీకి మెలుకువ వచ్చి చూడగా ఆమె కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతకగా సమీపంలో గల వ్యవసాయ బావిలో మెహరున్నీసా మృతదేహంపైకి తేలింది. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని బయటికి తీసి మార్చురీకి తరలించారు. మృతురాలుకి భర్త అబ్బాసలీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పద్మాక్షికాలనీ, శివ ముక్తిధామ్, రాజ్‌పుత్‌వాడ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

టీబీఈఎస్ఎస్ జిల్లా కమిటీ పదవీ కాలం పొడిగింపు

కాళోజీ సెంటర్: తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘ్ వరంగల్ జిల్లా కమిటీ పదవీ కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పీపీ రాథోడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుల సీరాం ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా అధ్యక్షుడు లావుడ్య సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా లావుడ్య సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా హట్కార్ తిరుపతి, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా భూక్య రవికుమార్, జిల్లా కోశాధికారిగా భూక్య రవీందర్ నాయక్ అదే పదవుల్లో కొనసాగనున్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో కేయూకు చోటు

కేయూ క్యాంపస్: సిద్దిపేటలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సభల్లో నూతన కమిటీని ఎన్నుకోగా, అందులో కేయూ నుంచి పలువురికి చోటు లభించింది. ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా కాకతీయ యూనివర్సిటీలోని మ్యాథ్‌మెటిక్స్ విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థి అంబాల కిరణ్, స్టేట్ యూనివర్సిటీస్ కోకన్వీనర్‌గా పొలిటికల్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థి చట్ల సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉప్పటి హరికృష్ణ (ఎకనామిక్స్‌విభాగం), పసుపులేటి పూజ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) ఎన్నికయ్యారు.

మౌలిక వసతులు కల్పించాలి

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేట బస్టాప్ ప్రాంతంలోని మొదటి వీధిలో నివాసముంటున్న తమకు వీధి దీపాలు, సైడ్ డ్రెయినేజీలు, రోడ్డుతో కూడిన మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరారు. ఈమేరకు కార్పొరేటర్ మామిండ్ల రాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీధర్, మధు, త్యాగరాజు, ఫాతిమా, రాజమణి, సరోజన తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై సదాలక్ష్మి విగ్రహం పెట్టాలి

దేశాయిపేట: మాదిగ హక్కుల పోరాట ఉక్కు మహిళ, మాజీ మంత్రి సదాలక్ష్మమ్మ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ట్యానరీ లెదర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తూరి యాకేందర్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు దేశాయిపేటలోని ఎస్ఆర్‌భవన్‌లో సదాలక్ష్మి జయంతి సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటి ఆది జాంబవ్వ అరుంధతి ఫెడరేషన్ ద్వారా అలాగే, లిడ్ క్యాప్, మాదిగల హక్కుల కోసం పోరాడిన ఉక్కు మహిళ సదాలక్ష్మి అని కొనియాడారు. తొలి మహిళా డిప్యూటీ స్పీకర్‌గా దేవాదాయ, సోషల్ వెల్ఫేర్ శాఖలను సమర్థవంతంగా నిర్వహించిన మొదటి మహిళగా గుర్తింపు పొందారని గుర్తుచేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు జన్ను సుశీరాజ్, మహ్మద్ సిద్దిక్ అహ్మద్, జేఈ.ప్రసాద్, అశోక్, మహిళలు పాల్గొన్నారు.

పూర్ణ పుష్కలంబా సమేత అయ్యప్ప కల్యాణం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని అయ్యప్పస్వామి కల్యాణ వేడుకలను పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూర్ణపుష్కలంబ సమేత అయ్యప్పకు కల్యాణ వేడుకలు జరిపించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారులు భారీగా తరలివచ్చారు.

గ్రంథాలయం ఏర్పాటు గుర్తు లేదా..!

- వాగ్దానం చేసి మరిచిన గత పాలకులు
- ఇతర ప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థులు, అభ్యర్థులు
- అధికారులు చొరవచూపాలని స్థానికుల విజ్ఞప్తి



గ్రంథాలయ భవన నిర్మాణానికి గ్రామస్తులు చూపిన అనువైన స్థలం

నడికూడ : ప్రజలను విజ్ఞానవంతులను చేసేందుకు గ్రంథాలయాలు దోహదపడుతాయి. అయితే డిజిటల్ మెటీరియల్ అందుబాటులో ఉన్నప్పటికీ గ్రంథాలయాల్లో లభిస్తున్న సమాచారంతో పాటు పఠనాసక్తిని పెంపొందించేందుకు గ్రంథాలయాలు ప్రముఖపాత్ర పోశిస్తాయి. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. చాలా వరకు వ్యవసాయ ఆధారిత కుటుంబాలు కావడంతో మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు పోటీ పరీక్షల శిక్షణకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు, యువతకు ఉపయోగపడే కెరీర్ గైడెన్స్, వివిధ పోటీ పరీక్షల పుస్తకాలు, పలు రకాల న్యూస్ పేపర్ల ద్వారా జాతీయ, అంతర్జాతీయ విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. గతంలో మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించి అప్పటి పాలకులు హడావుడి చేసి వదిలేశారని తెలిపారు. మండల కేంద్రంలోని పాత పశువైద్యశాల స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి అనువైన స్థలం ఉందని, తాత్కాలికంగా పాత గ్రామపంచాయతీ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని స్థానికులతో పాటు విద్యార్థులు కోరుతున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



నాతో పాటు చాలా మంది మిత్రులు పోటీ పరీక్షల కోసం సన్నద్ధం అవుతుండేవాళ్లు. అప్పట్లో పరకాల లేదా హనుమకొండలోని గ్రంథాలయాలకు వెళ్లి చదువుకునే వాళ్లం. గ్రంథాలయాలకు వెళ్లి చదువుకుంటే పఠనాసక్తి పెరుగుతుంది. గ్రంథాలయలు పుస్తకాలను ఉంచే భవంతిలా కాకుండా విజ్ఞాన కేంద్రాలుగా ఉంటేనే ఎంతో ఉపయోగకరం.

– మహ్మద్ ఇక్రంఉద్దీన్ ఉపాధ్యాయుడు, నడికూడ

అధికారులు చొరవచూపాలి



మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేయాలని పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోలేదు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వివిధ రకాల పుస్తకాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. అధికారులు చొరవచూపాలి.

– లోకటి నాగేష్ రావు, నడికూడ

చేయిచేయి కలిపారు.. చేయూతనిచ్చారు



నాగరాజుకు ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



రమేశ్ కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన చల్లూరి నాగరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయి అచేతన స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న 2006–07 అతడితో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం పరామర్శించారు. ఈ మేరకు తలోకొంత పోగుచేసి రూ.21,600 నగదును ఆర్థికసాయంగా అందించారు. అదే విధంగా కమలాపూర్‌కు చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబీకుడు జడల రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి కమలాపూర్ మండల పద్మశాలి సంఘం సభ్యులు శుక్రవారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాగరాజు మిత్రులు రాజేష్, తిరుపతి, కిశోర్, సతీష్, అనిల్, రాజేష్, పద్మశాలి సంఘం నాయకులు పారండ్ల రమేశ్, మెండు రమేశ్, వావిలాల మురళి, చెనుమల్ల శ్రీకాంత్, నరసింహస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

హసన్‌పర్తి: ఇద్దరు చిన్నారులు తప్పిపోయారని తల్లిదండ్రులు 100నంబర్‌కు డయల్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ చిన్నారులను 30 నిమిషాల్లో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదర్శ కాలనీకి చెందిన కాల్వచర్ల మల్లికార్జునచారి కుమారుడు కాల్వచర్ల అశ్వంత్ (9)తో పాటు అదే ప్రాంతానికి చెందిన కందికొండ లక్ష్మ్య(4) కలిసి శుక్రవారం సాయంత్రం 6గంటలకు ఆడుకునేందుకు బయటికి వెళ్లారు. చాలాసేపు అయినా ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో 100కు డయల్ చేశారు. అలర్ట్ అయిన పోలీసులు చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టారు. ఆ ఇద్దరు పక్క వీధిలో ఉన్నట్లు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ చిన్న పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు మన్మోహన్‌సింగ్

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు మాజీ ప్రధాని మంత్రి మన్మోహన్‌సింగ్ అని కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఆయన మృతి యావత్ భారతదేశానికి తీరనిలోటని అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘన నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



శాయంపేట : మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



ఎల్కతుర్తిలో..



పరకాలలో..



ఆత్మకూరులో..



కమలాపూర్ : మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



దామెరలో..

సంక్షిప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ధర్మసాగర్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఉనికిచర్ల గ్రామ శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాపాకపల్లి గ్రామానికి చెందిన గొల్లెన సారయ్య (56) గురువారం రాత్రి ద్విచక్రవాహనంలో కోమటిపల్లి శివారులో పెట్రోల్ పోసుకొని తిరిగి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఉనికిచర్ల గ్రామ శివారులోని పెద్దమ్మ గుడి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా సారయ్య అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరాధారమైన ఆరోపణలు సరికాదు



న్యాయం చేయాలంటూ బాధితుడి వేడుకోలు

దామెర : తనపై దాడిచేసి చేయివిరిచి, మళ్లీ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని పులుకుర్తికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సుధన్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు మండలంలోని పులుకుర్తిలో శుక్రవారం విలేకరులతో తన గోడు వెలిబుచ్చాడు. పులుకుర్తికి చెందిన సుధన్.. ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పెరుక సత్యం అనే రైతుకు వ్యవసాయ పని చేశాడు. ఈ మేరకు సుధన్‌కు రూ.46,000 ఇవ్వాల్సిఉంది. ఈ విషయమై గ్రామ పెద్దలు సత్యంతో మాట్లాడి డబ్బులు ఇవ్వాలని సూచించారు. అయినా మాటలు సైతం వినకుండా సుధన్‌పై దాడి చేసి చేయి విరిచాడు. ఇంత జరిగినా తప్పుడు ప్రచారం చేస్తున్న పెరుక సత్యంపై చట్టప్రకారం చర్య తీసుకోవాలని పోలీసులను వేడుకున్నాడు. అనంతరం ట్రాక్టర్స్ అండ్ డ్రైవర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు అడవల రాజు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా పెరుక సత్యం వ్యవసాయ పనులు చేయించుకొని డబ్బులు ఇవ్వకపోవడమే కాకుండా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. యూనియన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి రమేశ్, వైస్ ప్రెసిడెంట్ తోట రాజేందర్, మోరె చిరంజీవి, పెంచాల శ్రీనివాస్, బొల్లం సూర్యకిరణ్, మోరె నాగరాజు, ఐలాపురం శ్రీనివాస్, బూతం రాకేష్ పాల్గొన్నారు.

'రేపాల' కు సన్మానం



పరకాల : ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో శుక్రవారం ఉత్తర తెలంగాణలోని ఐదు జిల్లాలకు చెందిన ఉత్తమ కళాకారులకు, ఉద్యమకారులకు సన్మాన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, రచయిత రేపాల నర్సింహరాములను ఘనంగా సన్మానించారు. నిజాం పాలన నుంచి విముక్తి కోసం నాడు సాయుధ పోరాట యోధులు చేసిన పోరాటాన్ని అనేక రచనలతో కళ్లకుకట్టినట్లు తెలిపారని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ తదితరులు కొనియాడారు. మరిన్ని రచనలు రచించాలని సూచించారు.

కూలిన గోడ

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన కొండేటి రవి ఇంటి గోడ శుక్రవారం కుప్పకూలింది. ప్రమాద సమయంలో దంపతులతోపాటు వారి ఇద్దరు పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి సాగుచేయాలి

- ఏఓ సునీల్‌కుమార్



డ్రమ్‌సీడర్‌తో వరిసాగు క్షేత్ర ప్రదర్శన చేస్తున్న ఏఓ సునీల్‌కుమార్, పాల్గొన్న రైతులు

ఐనవోలు : యాసంగిలో వరిసాగు చేసే రైతులు డ్రమ్‌సీడర్ పద్ధతిలో సాగు చేయాలని ఏఓ సునీల్ కుమార్ సూచించారు. మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో శుక్రవారం డ్రమ్‌సీడర్ ఉపయోగించి నేరుగా వరి విత్తుకునే పద్ధతిపై వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రమ్‌సీడర్ పద్ధతిలో ఎకరాకు 10–12 కిలోల విత్తనం సరిపోతుందన్నారు. నాటు వేసేందుకు కూళ్ల రూ.5వేల వరకు తగ్గడమే కాకుండా కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. తక్కువ నీటితో పంట సాగు చేయొచ్చని, సాధారణ దిగుబడి కంటే 2 నుంచి 4 బస్తాలు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ విధానంలో సాగుచేస్తే పంట కాలపరిమితి 10–15 రోజులు తగ్గుతుందన్నారు. కలుపు నివారణకు విత్తిన మూడు రోజులలోగా ఒకసారి, రెండో దఫా 15–20 రోజుల్లో కలుపు మందు పిచికారీ చేసుకుంటే పూర్తిగా కలుపును నివారించవచ్చన్నారు. తక్కువ పెట్టుబడి, కూలీల కొరతను అధిగమించేందుకు డ్రమ్‌సీడర్‌తో వరిసాగు ఫలవంతంగా ఉంటుందని అన్నారు. రైతులందరూ సాగు పద్ధతులను మార్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అనూష, రైతులు పొన్నాల రాజు, పెంతల రాంరెడ్డి, పొన్నాల కొమురయ్య, పెంతల మల్లారెడ్డి, ఎండీ పీర్‌మహ్మద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇవ్వాలి

- జిల్లా అధ్యక్షుడు కర్రు సంపత్



జిల్లా కమిటీ సభ్యులను సన్మానించిన ఆర్‌ఎంపీలు

శాయంపేట : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీలకు శిక్షణ అందించాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కర్రు సంపత్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులు శక్తికి మించి వైద్యం అందించొద్దని సూచించారు. కొందరు డాక్టర్ల పేర్లు పెట్టుకుని క్లినిక్ బోర్డులను ఏర్పాటు చేసి వైద్యం చేయడం సరికాదన్నారు. అలాంటి బోర్డులను తొలగించి ప్రథమ చికిత్స పేరుతోనే బోర్డులు ఏర్పాటు చేసుకుని వైద్యం అందించాలని అన్నారు. ఆర్‌ఎంపీల క్లీనిక్‌లపై ఐఎంఏ, నేషనల్ కౌన్సిల్ సభ్యుల పేరుతో దాడులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మియాపురం శివుడు, పైడిపాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆగస్టిన్, కోశాధికారి కడివెండి రమేశ్, వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు కానుగుల నాగరాజు, కార్యదర్శి అబ్బు జయపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీను, సీనియర్ వైద్యులు హింగే భాస్కర్, రమేశ్, అక్రమ్, శ్రీధర్, సమ్మయ్య పాల్గొన్నారు.

కుటుంబ బలోపేతంలో మహిళలు కీలకం

- సర్వోదయ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్



మాట్లాడుతున్న కవిరాజ్

ఆత్మకూరు : కుటుంబ బలోపేతంలో మహిళల పాత్ర కీలకమని సర్వోదయ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా సహాయత కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల ఎదుగుదల, కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర గొప్పదన్నారు. గ్రామాల్లో కుటుంబ సమస్యలు పరిష్కరించుకునేందుకు మహిళా సహాయత కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలకు ఎలాంటి సమస్యలున్నా 181 టోల్ ఫ్రీ నంబర్‌ని సంప్రదించాలని సూచించారు. తద్వారా సఖి కేంద్రం సేవలను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనురాధ, సునీత, ఆశ కార్యకర్త సంధ్య, యూత్ లీడర్ రాజేందర్, సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ రవీందర్, కేస్‌వర్కర్ హరితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలు ప్రాణం మీదకు వస్తున్నాయి



ఆత్మకూరు : గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు



నడికూడ : గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల ఆవేదన
- గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన

నడికూడ : 'గ్రామాభివృద్ధి కోసం అహర్నిషలు కష్టపడ్డాం. ప్రభుత్వం నుంచి అరకొరగా నిధులు వచ్చినా.. అధికారుల భరోసాతో అప్పులు తెచ్చి పనులు చేశాం. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి ప్రాణం మీదకు వస్తున్నాయి.. నెలనెల వడ్డీ కట్టలేక పప్పుకూడే దిక్కవుతోంది. అప్పటికైనా చేసిన పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోండి' అంటూ మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్‌లు ఊర రవీందర్‌రావు, బొట్ల రవీందర్, సదానందం మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కోసం అప్పులు తెచ్చి పనులు చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దాటవేత ధోరణితో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ గోడును వినిపించుకొని వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని వారు కోరారు.

ఆత్మకూరు : పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ మండలంలోని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని హైస్కూల్ లో గల గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు సావురే కమలరాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేశామని, ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మాజీ సర్పంచ్‌లు మచ్చిక యాదగిరిగౌడ్, కొరె లలితరమేష్, బీఆర్ఎస్ నాయకులు వంగాల భగవాన్‌రెడ్డి, ఎండి.అంకూస్, సదానందం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'నాగుర్ల' పరామర్శ

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన కొడెపాక రాధమ్మ ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్లు శుక్రవారం పరామర్శించారు. రైతు సంఘం నాయకులు వరికెల కిషన్‌రావు, మాజీ ఉపసర్పంచ్ ధర్మారావు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న సభ

పర్వతగిరి : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 3న మాదిగ ఉప కులాల జేఏసీ ఆధ్వర్యంలో లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల సభ నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బీర్రు మహేందర్ తెలిపారు. మాదిగ, ఉప కులాల నాయకులు పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.